బౌల్డరింగ్ ఫెస్టివల్ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-కుప్పం: కుప్పం మండలం కంగుందిలో జనవరి 6 వ తేదీ నుంచి 10వ తేదీ వరకు నిర్వహించే కంగుంది బౌల్డరింగ్ ఫెస్టివల్ పోస్టర్‌ను అమరావతిలో సీఎం చంద్రబాబు శనివారం ఆవిష్కరించారు. రాష్ట్రంలో పర్యావరణ టూరిజం, అడ్వెంచర్ క్రీడలను ప్రోత్సహించడానికి సీఎం చంద్రబాబు ఎప్పుడూ ముందుంటారని ఏపీఈడబ్ల్యూడిసి ఛైర్మన్ రాజశేఖర్ పేర్కొన్నారు. మొట్టమొదట కంగుందిలో నిర్వహిస్తున్న బౌల్డరింగ్ ఫెస్టివల్ ముగింపు కార్యక్రమానికి సీఎం చంద్రబాబు హాజరు కానున్నట్లు సమాచారం. కుప్పం ప్రాంతాన్ని ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడంలో భాగంగా కడ ఆధ్వర్యంలో బౌల్డరింగ్ ఫెస్టివల్‌ను నిర్వహిస్తున్నారు.

బౌల్డరింగ్ ఫెస్టివల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

విద్యార్థి లేనిదే..ఏ ఉద్యమమూ లేదు..!

- స్వాతంత్ర్యోద్యమంలోనూ వారిదే కీలకపాత్ర
- ఉన్నత విద్యలో సమూల మార్పుకు నడుం బిగించాలి
- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభల్లో సంఘీభావ వక్తలు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

'విద్యార్థి లేనిదే ఏ ఉద్యమం లేదని చరిత్ర చెబుతోంది..నాడు స్వాతంత్ర్యోద్యమంలోనూ విద్యార్థులకు కీలక భూమిక పోషించారు.. నేడు కాషాయీకరణ, వ్యాపారీకరణ, కేంద్రీకరణతో కూడిన నూతన విద్యను సమూలంగా మార్చాలంటూ బలమైన విద్యార్థి ఉద్యమాన్ని నిర్మించాలి' అని వక్తలు పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభలు తిరుపతి కచ్చపి ఆడిటోరియంలో శనివారం రెండో రోజూ కొనసాగింది. ఈ సందర్భంగా ఈ మహాసభలకు సంఘీభావం తెలుపుతూ రాష్ట్రసంఘాల ప్రతినిధులు ప్రసంగించారు.

కెఎస్.లక్ష్మణరావు

పిడిఎఫ్ మాజీ ఎంఎల్‌సి, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు కెఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ 'నేను ఎస్ఎఫ్ఐ నుంచే నాయకత్వ లక్షణాలను అలవరచుకున్నారు. ఆంధ్రా యూనివర్సిటీలో జరిగిన విద్యార్థి ఎన్నికల్లో పోటీచేసి జనరల్ సెక్రటరీగా ఎన్నికయ్యాను. తరువాత 25 ఏళ్లపాటు లెక్చరర్‌గా పనిచేశాను. 14 ఏళ్లపాటు పిడిఎఫ్ ఎంఎల్‌సిగా ఉన్నాను. ఇంత స్థాయికి రావడానికి కారణం ఎస్ఎఫ్ఐ క్రమశిక్షణ, ఉద్యమం నేర్పిన పాఠాలు. సమాజంలో పేదల కోసం విద్యార్థులు పని చేయాల్సిన అవసరం ఉంది. ఉన్నత విద్యను వ్యాపారమయంగా మార్చేశారు. ఇంజినీరింగ్ విద్యార్థుల సమస్యలపై ఎస్ఎఫ్ఐ అధ్యయనం చేసి పోరాటాల రూపకల్పన చేయాల్సిన అవసరం ఉంది. వారికోసం వర్కుషాపులు, శిక్షణా తరగతులు, టెక్నాలజీతో కూడిన శిక్షణ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చేయాలి. ఎన్నికలకు ముందు అధికారంలోకి వచ్చిన వెంటనే జీవో 77 రద్దు చేస్తామని ప్రకటించిన మంత్రి నారా లోకేష్ విస్మరించారన్నారు. జగన్ హయాంలో ఆరు పాఠశాలలను చేస్తే, నారా లోకేష్ ఆధ్వర్యంలో తొమ్మిది రకాల పాఠశాలలుగా విభజించి 25వేల స్కూళ్లు మూతబడేలా చేశారన్నారు. రాష్ట్రంలో 66 లక్షల మంది ప్రజలు చదువుతుంటే 34లక్షల మంది పిల్లలు ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో చదువుతున్నారన్నారు.

నక్కా వెంకటేశ్వర్లు

యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఊరికి వెళ్లేటప్పుడు ఇంటికి ఏ విధంగా తాళం వేసుకుని వెళతామో స్కూలుకు వెళ్లే విద్యార్థులు కులం, మతాలన్నింటినీ ఇంటి గడప లోపలే వదిలేసి వెళ్లాలన్నారు. భారత రాజ్యాంగం కల్పించిన ప్రతి ఒక్కరికీ చదువు అనేది నేటి పాలకులు విస్మరిస్తున్నారన్నారు. నాణ్యమైన, ఉన్నత విద్య అభివృద్ధికి ఎస్ఎఫ్ఐ చేసే పోరాటంలో యుటిఎఫ్ క్రియాశీలకంగా భాగస్వామ్యం అవుతుందన్నారు.

వి.వెంకటేశ్వర్లు

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యార్థి ఉద్యమం లేనిదే ఏ ఉద్యమమూ లేదన్నారు. సామ్రాజ్యవాద అమెరికాలో కీలకనగరమైన న్యూయార్క్‌లో సోషలిస్ట్ పవనాలు వీస్తున్నాయన్నారు. సామ్రాజ్యవాదం బీటలు వారుతుందనడానికి నిదర్శనమన్నారు. రాష్ట్రంలో 40శాతం మంది వ్యవసాయ కూలీల పిల్లలేనని అన్నారు. రెక్కాడితేగాని డొక్కాడని కుటుంబాల్లో చదివించడమే ఎక్కువైతే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొస్తున్న నూతన విద్యా విధానం వల్ల డ్రాపౌట్స్ పెరిగే ప్రమాదం ఉందన్నారు.

కందారపు మురళి

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా విద్యార్థి, కార్మిక సంఘాలు కలసి పని చేయాల్సిన అవసరం ఉంది. విద్యను వ్యాపారీకరణ చేసేశారు. ఎన్నో త్యాగాల ఫలితంగా సాధించుకున్న స్వాతంత్ర్య ఫలాలను అదానీ, అంబానీలకు ప్రధాని మోడీ దోచి పెడుతున్నారన్నారు. దేశంలో లేబర్‌కోడ్‌లను తెచ్చి కార్మిక శక్తిని బలహీనపరిచేందుకు మోడీ సర్కార్ కుట్ర పన్నుతుందన్నారు. దేశం క్లిష్టపరిస్థితులు ఉన్న నేపథ్యంలో బలమైన ఉద్యమం జరగాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో చంద్రబాబునాయుడు మోడీ కనుసన్నల్లో పాలన చేస్తున్నారు తప్ప స్వయం పాలన లేదన్నారు. కేరళలో కేంద్రం సహాయ సహకారాలు లేకపోయినప్పటికీ పేదరికాన్ని జయించిందన్నారు. సామ్రాజ్యవాదానికి సవాల్ విసురుతూ చైనా, క్యూబాలు ధీటైన ప్రత్యామ్నాయాలతో ముందుకు పోతున్నాయన్నారు.

శ్రేష్ఠ, పాండిచ్చేరి

పాండిచ్చేరి యూనివర్సిటీలో ఇటీవల ఎన్నికైన యూనియన్ ఉపాధ్యక్షురాలు శ్రేష్ఠ ఎస్ఎఫ్ఐ ఉద్యమ ఫలితాలను వివరించారు. అఖిలభారత అధ్యక్షులు ఆదర్శ్ ఎం.సాజి, కార్యదర్శి శ్రీజన్ భట్టాచార్య, రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు కె.రామ్మోహన్, కె.ప్రసన్నకుమార్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అక్బర్, భగత్‌రవి పాల్గొన్నారు.

ఉద్యమ వీరుడు కామ్రేడ్ పెంచలయ్యకు ఎస్ఎఫ్ఐ 25వ రాష్ట్ర మహాసభ ప్రతినిధుల 'లాల్‌సలాం'

ఉద్యమాల్లో బతికే ఉన్నాడు : సతీమణి దుర్గ

పలమనేరుకు భార్యాభర్తల మృతదేహాలు

- బాధిత కుటుంబానికి పలువురి పరామర్శ
- ప్రభుత్వం తరపున ఆదుకుంటామని తహాశీల్దారు హామీ

ప్రజాశక్తి- పలమనేరు: తీర్థయాత్రలకు వెళ్లి అల్లూరి సీతారామరాజు జిల్లాలో బస్సుల బోల్తాపడిన ప్రమాదంలో మృతి చెందిన చిత్తూరు జిల్లా పలమనేరు నియోజకవర్గానికి చెందిన భార్యాభర్తలు సునంద, శివశంకర్‌రెడ్డి మృత దేహాలను పోస్టుమార్టం అనంతరం శనివారం పలమనేరుకు తీసుకొచ్చారు. దీంతో ఆ గ్రామంలో బంధువుల రోదనలు మిన్నంటాయి. పలువురు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ప్రభుత్వం తరపున ఆదుకుంటామని తహాశీల్దారు హామీ ఇచ్చారు.

పలమనేరు: మునినారాయణ శెట్టి వీధిలో నివసిస్తున్న సునంద, (45), శివశంకర్ రెడ్డి(50) అల్లూరి సీతారామరాజు జిల్లా బస్సు ప్రమాదంలో మృతి చెందారు. శివశంకర్ రెడ్డి ఓ ప్రైవేటు హేచరీస్‌లో పనిచేస్తుండగా, సునంద గృహిణి, ఇదే ఘటనలో చిత్తూరులో నివసిస్తున్న సునంద తల్లి సైతం మృతి చెందారు. కాగా ప్రభుత్వ యంత్రాంగం సహాయంతో శనివారం ఉదయం వారి మృతదేహాలు పలమనేరుకు చేరాయి. సమాచారం అందుకున్న పలమనేరు తహాశీల్దారు ఇన్బనాథన్ మృతుల స్వగృహానికి చేరుకుని బాధితులను పరామర్శించారు. ఈ

సందర్భంగా ప్రభుత్వం నుండి వారి కుటుంబీకులకు సహాయ సహకారాలు అందిం చేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. మృతులకు ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ప్రకటి స్తుందన్నారు. ఏరియా కౌన్సిలర్ బిఆర్‌సి కుమార్ మాట్లాడుతూ శివశంకర్ రెడ్డి, సునంద రెడ్డి తమ వీధిలో కాపురం ఉంటున్నారని, తీర్థయాత్రలకు వెళ్లి అకాల మరణం చెందడం తీవ్రంగా బాధి స్తోందన్నారు. ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి ఆదేశాల మేరకు తదుపరి కార్యక్రమాలు చేపడుతామని తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సదుపాయాలు : కలెక్టర్

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: ప్రభుత్వ పాఠశాల పిల్లలకు మెరుగైన సదుపా యాలు కల్పించడమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొ న్నారు. స్థానిక కన్నన్ కాలేజ్ ప్రాంగణంలో కోటి రూపాయల వ్యయంతో విద్యార్థుల సౌకర్యార్థం రెండు అంతస్థుల హాస్టల్ భవన నిర్మా ణానికి శనివారం శంకుస్థాపన చేశారు. ముఖ్య అతిథిగా కలెక్టర్, చిత్తూరు, తిరుపతి ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్, శ్రీనివాసులు హాజ రయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చితూ_్తరు నగరంలో కన్నన్ కళాశాలకు గొప్ప చరిత్ర వుందని, ఆ గౌరవం పెంచుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతి సదు పాయాలు ఎంతో అవసరమని తెలిపారు. ఇలాంటి మౌలిక సదుపాయాలు విద్యార్థుల విద్యాభ్యాసానికి మరింత దోహదపడతాయని పేర్కొన్నారు. నూతన హాస్టలు భవనం ఒక కోటి రూపాయల అంచనా వ్యయంతో నిర్మించనున్న ఈ రెండు అంతస్థుల భవనం పూర్తయిన అనంతరం వసతి సామర్థ్యం పెరిగి, విద్యార్థుల అకాడమిక్ ప్రగతికి అనుకూలంగా వుంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చుడా ఛైర్మన్ కటారి హేమలత, మాజీ ఎంఎల్‌సి రాజా నరసింహులు, కళాశాల పూర్వ విద్యార్థులు, స్థానిక ప్రజా ప్రతినిధులు కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం, పాల్గొన్నారు.

హాస్టల్ నిర్మాణానికి భూమిపూజ నిర్వహిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యేలు

స్థల సేకరణ చేసి ఏడాది.. భవన నిర్మాణానికి ఇంకెన్నాళ్లో..?

- ముందుకు సాగని అంగన్‌వాడీ భవన నిర్మాణం
- అద్దె భవనంలో తప్పని ఇక్కట్లు

ప్రజాశక్తి -పలమనేరు రూరల్ (గంగవరం): మండలంలోని కీలపల్లి పంచాయతీ ఇఆర్ కొత్తపల్లి గ్రామ అంగన్‌వాడీ కేంద్రం భవన నిర్మాణానికి ఏడాది క్రితం స్థల సమీకరణ చేశారు. ఆ తర్వాత భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయడం మరిచారు. ప్రస్తుతం అద్దె భవనంలోనే అంగన్‌వాడీ కేంద్రం కొనసాగుతోంది. పాత అద్దె భవనంలో చాలీచాలని స్థల సమస్యతో సతమతమవుతున్నామని స్థానికులు వాపోతున్నారు. అధికారులు వెంటనే స్పందించి అంగన్‌వాడీ భవనం నిర్మించి అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

స్థల సేకరణ చేసి ఏడాది..

మండలంలోని కీలపల్లి పంచాయతీ జిఆర్ కొత్తపల్లి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేసి ఏళ్లు గడుస్తున్నాయి. పాత కాల అద్దె భవనంలోనే ప్రస్తుతం కొనసాగుతోంది. నెలకు రూ.1500 అద్దె చెల్లిస్తున్నారు. ఏడాది క్రితం అధికారులు వచ్చి గ్రామంలో స్థలం సమీరణ చేసి వెళ్లారని, ఆ తర్వాత ఇటు వైపు రాలేదని స్థానికులు వాపోతున్నారు.

ముందుకు సాగని అంగన్‌వాడీ భవన నిర్మాణం

స్థలం సేకరించి ఏడాది పూర్తవుతున్నా అధికారులు ఏ మాత్రం స్పందించడం లేదని పేర్కొంటున్నారు. అధికారులు నిర్లక్ష్యం వీడి ఇందుకు సంబంధించిన నిధులు మంజూరుచేసి వెంటనే భవన నిర్మాణాన్ని పూర్తి చేసి అంగన్‌వాడీ పిల్లలకు అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

అద్దె భవనంలో తప్పని ఇక్కట్లు

ప్రస్తుతం అద్దె భవనంలో 25 మంది విద్యార్థులు వున్నారని, వారికి స్థలం చాలకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. భవనం కూడా పాతకాలం నాటిది కావడంతో ఆందోళనకు గురి కావాల్సి వస్తోందని తెలిపారు. తగిన సౌకర్యాలు కూడా లేవని పేర్కొన్నారు. అధికారులు వెంటనే స్పందించి నూతన భవనాన్ని నిర్మించి అందుబాటులోకి తేవాలని అంగన్‌వాడీ సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రం

యాప్‌ల తంటాలు!

- అంగన్‌వాడీలు సతమతం

ప్రజాదృష్టి

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: చాలీచాలని జీతాలతో గౌరవ వేతనం తీసుకుంటూ ఐదు సంవత్సరాలలోపు చంటి పిల్లలకు విద్యాబుద్ధులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారాన్ని అందిస్తూ గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణ ప్రాంతాల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీలకు ఎఫ్ఆర్ఎస్ (ముఖ ఆధారిత హాజరు నమోదు), మొబైల్ ఫోన్ లో యాప్‌ల నమోదు తలనొప్పిగా మారింది. దీర్ఘకాలికంగా అంగన్‌వాడీలకు 26 వేల రూపాయల కనీస వేతనం, అంగన్‌వాడీ సెంటర్ నిర్వాహకులకు ఇబ్బందిగా మారుతున్న యాప్‌లు రద్దు చేయాలంటూ పోరాటం చేస్తున్న అంగన్‌వాడీలు, అంగన్‌వాడీ యూనియన్ల సంయుక్త పిలుపు మేరకు కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన అంగన్‌వాడీల పోరాటంలో వేలాది మంది పాల్గొని ప్రభుత్వానికి తమ నిరసన గళం వినిపించారు.

తాజాగా ప్రభుత్వం 5జి మొబైల్ ఫోన్‌లను అంగన్‌వాడీలకు అందిస్తోంది. 5జి మొబైల్ ఫోన్స్ అంగన్‌వాడీలకు మరింత తలనొప్పిగా మారనున్నాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఫేస్ రికగ్నిషన్ సిస్టమ్, టేక్ హోమ్ రేషన్ (టిహెచ్ఆర్) పంపిణీ సమయంలో ఫేస్ క్యాప్చరింగ్‌ను వంద శాతం చేయాలి, అప్పర్ అభి (సంబంధిత కార్యక్రమాలు, టార్గెట్లు) వంద శాతం పూర్తి చేయాలి, ప్రధాన మంత్రి మాతృ వందన యోజన (పిఎంఎంవివై)లో ప్రతి అంగన్‌వాడీ కేంద్రం నుండి కనీసం ఒక బెనిఫిషరీని రిజిస్టర్ చేయాలి.

పోరాటం చేస్తున్న అంగన్‌వాడీలు (ఫైల్‌ఫొటో)

(పిఎంఎంవివై)లో డ్యూ లిస్ట్‌ను పూర్తిగా క్లియర్ చేయాలి. పూర్తి స్థాయిలో అంగన్వాడీలకు 5జి మొబైల్స్ అందించిన తర్వాత యాప్‌ల నమోదు కఠిన తరం చేయనున్నారు. ఇప్పటికే కుప్పం, చిత్తూరులతో పాటు మరికొన్ని ప్రాజెక్టులలో అంగన్‌వాడీలకు 5జి ఫోన్ల పంపిణీ ప్రారంభించారు. ఇదిలా ఉంటే మరోవైపు బ్యాటరీ సైకిల్ కొనుగోలు చేయాలంటూ ఒత్తిడి పెరుగుతోంది.

చిత్తూరు జిల్లాలోని 31 మండలాల్లో 12 ఐసిడిఎస్ ప్రాజెక్టుల పరిధిలో 2,318 మెయిన్,102 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. 18,69364 మందికి ఐసిడిఎస్ సేవల అందుతున్నాయి. జిల్లాలో 10,046 మంది గర్భిణులు ,8032 మంది బాలింతలకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందుతోంది. 3–7 నెలల లోపు ఉన్న 50,809 మంది చంటి పిల్లలు, 3 సంవత్సరాల నుండి 7 సంవత్సరాలలోపు ఉన్న 29,539 మంది పిల్లలకు టేక్ హోమ్ రేషన్ పద్ధతిలో పౌష్టికాహారం అందించడంతో పాటు, ప్రీ స్కూలు పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల్లోని వేడివేడిగా ప్రభుత్వ మెనూ మేరకు భోజనం వండి అందించాల్సి ఉంటుంది. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ భారంగా ఉన్న అంగన్‌డీలపై ఎఫ్ఆర్ఎస్, యాప్ ల నమోదు తలనొప్పిగా మారుతోంది. గౌరవ వేతనాలతో పనిచేస్తున్న అంగన్‌వాడీల సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి ఎఫ్ఆర్ఎస్ యాప్‌ల నమోదును రద్దు చేయడంతో పాటు కనీస వేతనాలు అమలు చేయాలని అంగన్‌వాడీలు కోరుతున్నారు.

15 నుండి కెరీర్ ఫెస్ట్

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్:

జిల్లా సమగ్ర శిక్ష అధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థుల కోసం కెరీర్ ఫెస్ట్‌ను డిసెంబర్ 15 వ తేదీ నుండి 18 వరకు, అనంతరం 20వ తేదీ జిల్లా స్థాయి కెరీర్ ప్రదర్శనను నిర్వహించ నున్నట్లు ఆశాఖ అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ మద్దిపట్ల వెంకటరమణ పేర్కొన్నారు. ఈ నెల 15 వ తేదీ నుంచి 18 వరకు నిర్వహించే మొదటి నాలుగు రోజులు జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో నిర్వహిస్తారన్నారు. ఈ దశలో 6వ నుంచి 10వ తరగతి విద్యార్థులకు వివిధ రంగాలు, విభాగాల్లో ఉన్న విస్తృతమైన కెరీర్ అవకాశాలపై అవగాహన కల్పిస్తార న్నారు. కార్యా చరణ ఆధారిత అభ్యాస విధానం లో భాగంగా, విద్యార్థులు కెరీర్‌కు సంబంధిం చిన నమూనాలు (మోడల్స్) , మాడ్యూల్స్ తయారు చేసి, వివిధ వృత్తులు, అవసరమైన నైపుణ్యాలు, భవిష్యత్ అవ కాశాలపై ఆసక్తికరంగా, ప్రాయో జికంగా తెలుసుకునే అవకాశం పొం దు తారు. ఈ నెల 20న నిర్వహించ నున్న జిల్లా స్థాయి కార్యక్ర మంలో, విద్యార్థులు తయారు చేసిన ఉత్తమ నమూనాల ప్రదర్శనతో పాటు, వివిధ రంగాలకు చెందిన నిపుణు లచే ఏర్పాటు చేసిన సమాచార స్టాల్స్ ద్వారా వాస్తవ జీవితంలోని కెరీర్ అవకాశాలపై ప్రత్యక్ష అవగాహన కల్పిస్తా మన్నారు. ఈ కెరీర్ ఫెస్ట్ సమగ్ర శిక్ష చిత్తూరు జిల్లా కో ఆర్డినేటర్ డాక్టరు ఛాయేంద్ర కుమార్ సమన్వయంతో, అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ మద్దిపట్ల వెంకటరమణ సహ కారంతో రూపు దిద్దు కుని, చిత్తూరు జిల్లా విద్యాధికారి రాజేంద్ర ప్రసాద్ అనుమతితో అమలు చేస్తున్నా మన్నారు. ఈ కెరీర్ ఫెస్ట్ ద్వారా విద్యార్థుల్లో కెరీర్ అవగాహన పెంపొం దించడం, సరైన నిర్ణయాలు తీసుకునేలా ప్రోత్స హించడం, వారి భవిష్యత్ అవకాశాలపై విస్తృత దృష్టిని కల్పిం చడం లక్ష్యంగా రూ పొందించారు.

17 లోపు విగ్రహాలు స్వచ్ఛందంగా తొలగించాలి

- లేకుంటే పోలీసుల సమక్షంలో తొలగిస్తాం
- ఆర్‌డీవో అనుపమ

ప్రజాశక్తి -విజయపురం (నగరి) : జాతీయ రహదారి విస్తరణలో భాగంగా కొన్ని ఆలయాలు పూర్తిగాను, కొన్ని పాక్షికంగాను తొలగించనున్నారు. మండపాలు, శిలా విగ్రహాలు, ఆలయ ప్రవేశ ఆర్చిలను తొలగించనున్నారు. ఈ నెల 17వ తేదీ వరకు స్వచ్ఛందంగా వారే తొలగించుకునేందుకు గడువు ఇచ్చామని ఆపై తామే తొలగిస్తామని ఆర్డీవో అనుపమ శనివారం పేర్కొన్నారు. ఇప్పటికే సంబంధీకులతో పలుమార్లు సమావేశ మయ్యామని 21 మందికి నోటీసులు ఇచ్చామని ఆమె పేర్కొన్నారు. విగ్రహాల ఏర్పాటుకు స్థలం చూపామని పేర్కొన్నారు. అయినా సంబంధీకులు తొలగించలే దన్నారు. ఈ కారణంగా జాతీయ రహదారి పనులు జాప్యమవుతోందన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మూడు రోజుల గడువు అందిస్తున్నామని ఆ లోపు జాతీయ రహదారి అధికారులు చూపిన మార్కుల మేరకు సంబంధీకులు విగ్రహాలను, ఆలయాలను తొలగించు కోవాలన్నారు. అలా తొలగించకుంటే 17వ తేదీ నలుగురు తహాశీల్దారులు, పోలీసుల సమక్షంలో అధికారులే తొలగిస్తారని తెలిపారు.

రహదారి వెడల్పులో తొలగించేవి..

జిల్లాలోనే నగరి పట్టణంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే కొండచుట్టు ఉత్సవాలకు ఆధారంగా నిలచే కొండచుట్టు మండపం, కీళపట్టు ఆంజనేయస్వామి ఆలయం, దేశమ్మ ఆలయానికి వెళ్లే ఆర్చిని తొలగించ నున్నారు. నగరి ఓంశక్తి ఆలయం, అయ్యప్ప ఆల యాలతో పాటు పలు ఆలయాలు పాక్షికంగా తొలగించనున్నారు. నగరి దళితవాడ సమీపంలోని అంబేద్కర్ విగ్రహం, నగరి బైపాస్ వద్ద వైఎస్ఆర్ విగ్రహం, కొండచుట్టు మండపం వద్ద వున్న అంబేద్కర్ విగ్రహం జాతీయ రహదారి వెడల్పులో తొలగించ నున్నారు.


రోడ్డుకు అడ్డంగా వున్న కొండచుట్టు మండపం

రిటైర్డ్ పిఇటి గుండెపోటుతో మృతి

గోవిందరాజులు శెట్టి (ఫైల్‌ఫోటో)

ప్రజాశక్తి- పలమనేరు: ప్రభుత్వ జూనియర్ కళాశాల రిటైర్డ్ పిఇటి గోవిందరాజులు శెట్టి(67) పలమనేరు ఆర్‌టిసి డిపో వద్ద శనివారం గుండెపోటుతో హఠాత్తుగా మృతి చెందారు. ఆయన తన కుమార్తెను బస్సు ఎక్కించడానికి వచ్చి బస్సు కోసం వేచి ఉండగా ఉన్నట్టుండి కుప్పకూలి పడిపోయారు. వెంటనే ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పలమనేరు నియోజకవర్గంలో పలు ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలో ఆయన పనిచేశారు. పలువురు ఆయన మృతికి సంతాపం తెలిపారు.

చెత్త బుట్టలు పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

చెత్త బుట్టలతోనే పరిశుభ్రత: టిడిపి

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: చెత్తబుట్టలతోనే పరిసరాలు పరిశుభ్రమవుతాయని టిడిపి యువ నేత భాస్కర్ చౌదరి పేర్కొన్నారు. మండ లంలోని గుం తూరు గ్రామంలో శనివారం చెత్తబుట్టలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ గృహాల్లో పడే వ్యర్థాలను చెత్తబుట్టలో భద్రపరిచి పంచాయతీ వాహనం వచ్చినప్పుడు వాహనంలో వేయాలని తద్వారా పరిసరాలు పరిశుభ్రంగా ఉంటాయని ప్రతి ఒక్కరి ఆరోగ్యం పరిసరాల పరిశుభ్రతతోనే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఈశ్వరయ్య, గ్రామస్తులు సోమ, శంకర్ నాయుడు, రవి, శివ పాల్గొన్నారు.

యుటిఎఫ్ మండల కమిటీ ఎన్నిక

నూతనంగా ఎన్నికైన యుటిఎఫ్ మండల నాయకులు

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ మండల కార్య వర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్ను కున్నట్టు ఆ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి తెలిపారు. మండల గౌరవ అధ్యక్షులుగా కృష్ణయ్య, అధ్యక్షులుగా మహేష్, ప్రధాన కార్యదర్శిగా చంద్రశేఖర్ రెడ్డి, మండల కార్యదర్శిగా రానా ప్రతాప్, కోశాధికారిగా బాలాజీ, ఉపాధ్యక్షులుగా భాస్కర్, మహిళా ఉపాధ్యక్షులుగా సోనీ, సుమలత, మహిళా కన్వీనర్‌గా అమూల్య, సిపిఎస్ నాగ సులోచనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన వారి వద్ద జిల్లా గౌరవ అధ్యక్షులు సుధాకర్ రెడ్డి, కార్యదర్శులు సరిత ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారం చేయించారు.

నవోదయ పరీక్ష ప్రశాంతం

ప్రజాశక్తి-పలమనేరు: పలమనేరు ప్రభుత్వ హైస్కూలులో శనివారం నిర్వహించిన నవోదయ ప్రవేశ అర్హత పరీక్ష ప్రశాంతంగా సాగింది. 254 మంది విద్యార్థులకు, 155 మంది విద్యార్థులు హాజ రయ్యారు. 99 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. వీరందరికి ఫర్నీచర్, తాగునీటి సౌకర్యం కల్పించామన్నారు. ఈ పరీక్షకు డిపార్టుమెంటు ఆఫీసర్‌గా పలమనేరు మండల విద్యా శాఖాధికారి పి లీలారాణి , చీఫ్ ఆఫీసర్‌గా పలమనేరు బాలికోన్నత పాఠశాల హెడ్‌మాస్టర్ జి . సుజాత వ్యవహరించారు.

బంగారుపాలెం: నవోదయ పరీక్షకు 38 మంది గైర్హాజరయ్యారని పరీక్షల పర్యవేక్షణాధికారి గిరిరాజు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నవోదయ ప్రవేశ పరీక్ష నిర్వహించారు. మండలం నుండి 233 మంది దరఖాస్తు చేసుకోగా 195 మంది పరీక్షకు హాజరయ్యారని 38 మంది గైర్హాజరయ్యారని పరీక్షా కేంద్రాన్ని మదనపల్లి నవోదయ ప్రిన్సిపాల్ గీత పరిశీలించారన్నారు.

రేపు చేపల చెరువు వేలం

- డిప్యూటీ ఎంపీడీవో పురుషోత్తం

ప్రజాశక్తి -బంగారుపాలెం: మండలంలోని పాలేరు గ్రామం చిల్ల మల్ల చెరువులో చేపలు పట్టుకునేందుకు వేలంపాట సోమవారం ఉదయం పంచాయతీ కార్యాలయంలో నిర్వహిస్తామని డిప్యూటీ ఎంపీడీవో పురుషోత్తం తెలిపారు. ఆసక్తికలిగిన వారు 15 వేల రూపాయలు ధరావత్తు చెల్లించి పాటలో పాల్గొనాలని హెచ్చు పాటదారులు అప్పటికప్పుడే తగిన రుసుం చెల్లించి రసీదులు తీసుకుని సంబంధిత చెరువులో చేపలను పట్టుకుని విక్రయిం చుకోవచ్చని జనవరి నుండి జూన్ నెల వరకు ఈ గడువు వర్తిస్తుం దని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీ ప్రసాద్ రెడ్డి, పంచాయతీ అభివృద్ధి అధికారి మధు పాల్గొన్నారు.

పాత నేరస్తులతో సమావేశం నిర్వహిస్తున్న సీఐ శ్రీనివాసులు

నేరాలకు పాల్పడితే కఠిన శిక్ష: సీఐ

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: నేరాలకు పాల్పడితే కఠిన శిక్ష ఉంటుందని సీఐ శ్రీనివాసులు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో పాత నేరస్తులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ కేసుల్లో నమోదైన వారిని హెచ్చరిస్తూ అక్రమాలకు పాల్పడి కేసులు నమోదు చేసుకోకూడదని అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కేసుల్లో నమోదు అయితే జిల్లా బహిష్కరణ చేపడుతామని తెలిపారు.

ఏపీ ఎన్‌జీవోల జిల్లా కార్యవర్గం ఎన్నిక

ఏపీ ఎన్జీవోల జిల్లా నూతన కార్యవర్గం

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: ఏపీ ఎన్‌జివోల చిత్తూరు జిల్లా నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా కెవి రాఘవులు ఎన్నికయ్యారు. ఆయన ప్రస్తుతం జిల్లా సైనిక సంక్షేమ అధికారిగా చిత్తూరులో విధులు నిర్వహిస్తున్నారు. అసోసియేట్ అధ్యక్షుడిగా ఏరియా హాస్పిటల్, కుప్పంలో ఏఓగా పనిచేస్తున్న పిబి మురళీకృష్ణను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా బి బాలసుబ్రహ్మణ్యం, టిఎన్ పురుషోత్తం రెడ్డి, పి శ్రీనివాసులు, బి రవి కుమార్ నాయక్, ఎంఎస్ ప్రసాంత్ ఎన్నికయ్యారు. మహిళా ఉపాధ్యక్షురాలిగా ఎ చంద్రకళ ఎంపికయ్యారు. ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎస్‌జె ప్రదీప్ కుమార్, కార్యదర్శిగా కె రమేష్ ఎన్నికయ్యారు. సహ కార్యదర్శులుగా విఎస్ రెడ్యప్పన్, ఎన్ దాము, బి సురేష్ కుమార్, ఎ మహేష్, ఎం జ్యోతీశ్వర రెడ్డి, ఆర్ పూమాలలను నియమించారు. ట్రెజరర్‌గా ఎస్ మురళీ మోహన్ ఎన్నికయ్యారు. ఈ ఎన్నికల అధికారులుగా జి శ్రీనివాసరావు, కె జగదీశ్వరరావు సమర్థవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు చిత్తూరు జిల్లా నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నిక కావడం అభినంద నీయమన్నారు. నూతన కార్యవర్గం మూడు సంవత్సరాల పాటు పదవీకాలం నిర్వహిస్తుందని తెలిపారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నూతన కమిటీ కృషి చేయాలని, సమస్యలు ఉంటే రాష్ట్ర కమిటీ, జిల్లా కమిటీ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం నూతన కమిటీకి అభినందనలు తెలిపారు. పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు, ఉద్యోగ సంఘాల నాయకులు అభినందనలు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు కెవి రాఘవులు మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యత అప్పగించిన సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్ఐని కలిసిన జనసేన నాయకులు

ఎస్ఐని కలిసిన జనసేన నాయకులు

ప్రజాశక్తి -సోమల: సోమల ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన రమేష్‌ను మండల జనసేన నాయకులు, కార్యకర్తలు శనివారం మధ్యాహ్నం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల జనసేన అధ్యక్షులు నాగభూషణం, ఉపాధ్యక్షులు చాన్ బాష, శ్రీనివాసులు నాయుడు, రామకృష్ణ, ప్రభు, వినోద్, చెంగల్ రాయలు, యశ్వంత్ లక్ష్మీరెడ్డి పాల్గొన్నారు.

సోమల మండల మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాసులు నాయుడు నూతన ఎస్ఐ రమేష్‌ను శనివారం మర్యాద పూర్వకంగా కలిసి మిఠాయిలు అందించి అభినందనలు తెలిపారు. సీనియర్ టిడిపి నాయకులు మునీశ్వర ఎస్ఐని మర్యాదపూర్వకంగా కలిశారు.

బాల్య వివాహాల అనర్థాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

బాల్యవివాహాలు నిర్మూలించాలి

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: బాల్య వివాహాలను నిర్మూలించాలని డిప్యూటీ హెచ్ఐవో కాంతమ్మ పిలుపు నిచ్చారు. బైరెడ్డిపల్లి మండ లం తీర్థం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాల్యవివాహాల నిర్మూలనపై విద్యార్థులకు శనివారం అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ హెచ్ఐవో కాంతమ్మ మాట్లాడుతూ బాల్యవివాహాల వల్ల చిన్న వయసులోనే బాలికలు రక్తహీనతతో పాటు శారీరక, మానసిక రుగ్మతలకు గురయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. బాల్యవివాహాలు బాలికల ఆరోగ్యం, భవిష్యత్తును తీవ్రంగా ప్రభావితం చేస్తాయని, సమాజంలోని ప్రతి ఒక్కరూ వాటి నిర్మూలనకు బాధ్యతగా ముందుకు రావాలని ఆమె పిలుపునిచ్చారు. స్క్రబ్ టైఫస్ వ్యాధి గడ్డిలో ఉండే ఓ పురుగు కుట్టడంతో వస్తుందని, జ్వరం, తలనొప్పి వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప వైద్యులను సంప్రదించాలని సూచించారు.

15న ఉచిత డయాబెటిస్ చెకప్ క్యాంపు

డాక్టరు వినయ

ప్రజాశక్తి-కుప్పం: కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ సహకారంతో బెంగళూరు మహావీర్ జైన్ ఆసుపత్రి ఆధ్వర్యంలో 15వ తేదీ కుప్పంలో ఉచిత డయాబెటిస్ చెకప్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు డాక్టరు వినయ తెలిపారు. కుప్పం ఏరియా ఆసుపత్రిలో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు చెకప్ క్యాంపు నిర్వహించనున్నారు. రక్తంలో చక్కెర స్థాయి పరీక్ష, బిపి, సెన్సిటోమీటర్ ఉపయోగించి నరాల పరీక్ష, రక్త పరీక్ష బాగుందో లేదో తెలుసుకోవడానికి ఈ పరీక్ష నిర్వహి స్తామన్నారు. కుప్పం నియోజకవర్గ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

రాష్ట్ర పోటీలకు రొంపిచర్ల విద్యార్థులు

ప్రజాశక్తి - రొంపిచర్ల: రొంపిచర్ల జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి కౌశల్ క్విజ్ - 2025 పోటీలలో విజేతలై రాష్ట్ర స్థాయి పోటీ లకు ఎంపికయ్యారు. ఈనెల 27న తిరుపతి సంస్కృత విశ్వవిద్యాలయంలో నిర్వహించే రాష్ట్రస్థాయి కౌశల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు కే నాగ సింధు, ఎస్ షబ్రీన్, బి మహేశ్వరి ల ను శనివారం చిత్తూరు జిల్లా విద్యాశాఖ అధికారి రాజేంద్రప్రసాద్ తమ ఛాంబర్ లో ప్రత్యేక ప్రశంసాపత్రం, నగదు బహుమతితో సత్కరించారు. విద్యార్థినులు ఈ స్థాయిలో రాణించడానికి కృషిచేసిన పాఠశాల సైన్స్ టీచర్లు బి స్వాతి, టి గోమతి, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏ అమర శేఖర్, ఎంఈఓ డి శ్రీనివాసులు ప్రత్యేకంగా అభి నందించారు.

దివ్యాంగ విద్యార్థుల ప్రతిభ

జిల్లా పారాలింపిక్స్‌లో రాణించిన విద్యార్థులు

జిల్లా పారాలింపిక్స్‌లో ప్రతిభ చూపిన దివ్యాంగ విద్యార్థులు

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: జిల్లా స్థాయిలో శుక్రవారం నిర్వహించిన పారా లింపిక్స్ పోటీల్లో బైరెడ్డిపల్లి మండలానికి చెందిన దివ్యాంగ విద్యార్థులు అద్భుత ప్రతిభ ప్రదర్శించి పలువురు బహుమతులు సొంతం చేసుకున్నారు. వివిధ విభాగాల్లో రన్నింగ్, షాట్‌పుట్ పోటీల్లో ఉత్తమ ప్రదర్శనతో మండలానికి మంచి పేరు తెచ్చారు. జెడ్‌పిహెచ్ఎస్ గర్ల్స్, బీఆర్‌పీ పాఠశాలలో ఆరవ తరగతి చదువుతున్న మధుమతి ఎల్‌వి విభాగంలో రన్నింగ్‌లో మొదటి స్థానం, షాట్‌పుట్‌లో రెండో స్థానం సాధించి ప్రత్యేకంగా నిలిచారు. అదే పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న సాదియా రన్నింగ్‌లో రెండో స్థానం పొందారు. లక్కనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరవ తరగతి చదువుతున్న యుషిత ఎంఆర్ విభాగంలో రన్నింగ్‌లో ద్వితీయ స్థానం సాధించారు. జెడ్‌పిహెచ్ఎస్ బాయ్స్, బైరెడ్డిపల్లి పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న గణేష్ ఐడీ విభాగంలో రన్నింగ్‌లో తృతీయ స్థానం దక్కించుకున్నారు. ఎంపీపీఎస్ బైరెడ్డిపల్లిలో ఐదో తరగతి చదువుతున్న మదసీన్ ఎల్‌వి విభాగంలో రన్నింగ్‌లో రెండో స్థానం సాధించగా, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉర్దూ (బీఆర్‌పీ)లో ఆరవ తరగతి చదువుతున్న పరహన్ బాష ఐడీ విభాగంలో రన్నింగ్‌లో తృతీయ స్థానం పొందారు. ఇదే పోటీల్లో పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్న కొత్తఇండ్లకు చెందిన గోపీచంద్ సీపీ విభాగంలో రన్నింగ్‌లో ద్వితీయ స్థానం సాధించి జిల్లా స్థాయిలో మెప్పించారు. ఈ విజేతలకు జిల్లా సెక్టోరల్ ఐఈ అధికారి మధు ప్రోత్సాహంతో జిల్లా విద్యాశాఖ అధికారి, సమగ్ర శిక్ష ఏపీసి చేతులమీదుగా బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించారు. ఈ సందర్భంగా డీసీడీవో ఇంద్రాణి, బైరెడ్డిపల్లి మండల విద్యాశాఖ అధికారులు జనార్దన్ రెడ్డి, సుబ్రహ్మణ్యం, బైరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రకాష్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బీఆర్‌పీ) ప్రధానో పాధ్యాయులు మనోరంజని, దేశమ్మ, లక్కనపల్లి ప్రధానోపాధ్యాయులు కవిత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉర్దూ ప్రధానోపాధ్యాయులు హరినాథ్ తదితరులు విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఐఈఆర్పీ నిర్మలా కుమారి పాల్గొన్నారు.

పారాలింపిక్ గేమ్స్‌లో రొంపిచర్ల భవిత స్కూల్

రొంపిచర్ల: చిత్తూరులో నిర్వహించిన దివ్యాంగుల పారా లింపిక్స్ పోటీల్లో రొంపిచర్ల భవిత స్కూల్ విద్యార్థులు సత్తా చాటి బంగారు, వెండి పతకాలు సాధించారు. రన్నింగ్, లాంగ్ జంప్, షార్ట్ పుట్, త్రో బాల్ పోటీలలో నాలుగు బంగారు పతకాలు, రెండు వెండి పతకాలు సాధించారు. రొంపిచర్ల నుంచి ఏడు గురు విద్యార్థులు పాల్గొనగా ఆరుగురు పతకాలు సాధించారు. రొంపిచర్ల ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థి వి విక్రాంత్ రెడ్డి మూడు పతకాలతో ప్రతిభ చాటాడు. 100 మీటర్ల రన్నింగ్ రేస్ లో బంగారు పతకం, షార్ట్ పుట్, లాంగ్ జంప్ పోటీలలో వెండి పతకం సాధించాడు. రొంపిచర్ల బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని బి యశస్విని 100 మీటర్ల రన్నింగ్ రేస్ లో జిల్లాస్థాయి బంగారు పతకం సాధించింది. బి వీరసూర్య జూనియర్ విభాగంలో 100 మీటర్ల రన్నింగ్ రేస్ లో విజయం సాధించాడు. ప్రతిభ చాటిన విద్యార్థులకు డిఇఓ రాజేంద్రప్రసాద్, ఏపీఓ రమణ పథకాలతో పాటు ప్రశంసా పత్రాన్ని అందజేశారు. గెలుపొందిన విద్యార్థులను రొంపిచర్ల ఎంఈఓ డి శ్రీనివాసులు, పాఠశాలల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రశంసా పత్రాలు స్వీకరిస్తున్న రొంపిచెర్ల ప్రత్యేక ప్రతిభావంతులైన విద్యార్థులు

మత్తు పదార్థాలతో భవిష్యత్తు అంధకారం

- సీనియర్ సివిల్ జడ్జి భారతి

మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి భారతి

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : మత్తు పదార్థాలతో భవిష్యత్తు అంధకారం అవుతుందని సీనియర్ సివిల్ జడ్జి భారతి పేర్కొన్నారు. విద్య జూనియర్ కళాశాలలో యాంటీ డ్రగ్స్ అవేర్‌నెస్ ప్రోగ్రాంను ఆ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ పి నవీన్ కుమార్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీనియర్ సివిల్ జడ్జి భారతి, జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ రఘు పతి, ఎన్జీవో డైరెక్టర్ అబ్రహాం సంతానం, వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ మహేశ్వర్, సిసిఎస్ ఇన్‌స్పెక్టర్ ఉమామహేశ్వర్, అవార్డ్స్ ఎన్జీవో ప్రెసిడెంట్ రవి కుమార్, భూపతి హాజరయ్యారు. మొదట సీనియర్ సివిల్ జడ్జి భారతి మాట్లా డుతూ విద్యార్థులకు చట్టాలు , శిక్షలు గురించి అవగాహన కల్పించారు. డిఐఈఓ రఘుపతి మాట్లాడుతూ విద్యార్థులు మాదక ద్రవ్యాల మత్తులో పడి బంగారు భవిష్యత్తుని నాశనం కాకుండా కాపాడుకోవాలని సూచించారు. అబ్రహాం సంతానం మాట్లాడుతూ పిల్లలకి మాదక ద్రవ్యాలపై ఆలోచన రాకుండా వుండాలంటే క్రీడలపై దృష్టి పెట్టాలని సూచించారు. సీఐ మహేశ్వర్ మాట్లాడుతూ పిల్లలు మొబైల్ ఫోన్స్ ఉపయోగిస్తారని వాటి వల్ల తమ విలువైన కాలాన్ని వృథా చేసుకుంటున్నారని మాదకద్రవ్యాల పట్ల పూర్తిగా అప్రమత్తంగా ఎలా ఉండాలో వివరించారు. విద్యార్థులు చెడు అలవాట్లకి బానిస కాకుండా వాళ్ల భవిష్యత్తుపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కళాకారుల బృందంతో నాటకాలు, పాటలు ద్వారా డ్రగ్స్ ఉపయోగించడం వల్ల కలిగే నష్టాలను చక్కగా ప్రదర్శించి విద్యార్థుల భవిష్యత్తు అభివృద్ధికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన విద్యార్థులకు , అధ్యాపకులకు, ముఖ్య అతిథులకు కళాశాల కరస్పాండెంట్ అభినందనలు తెలిపారు.

కఠిన చర్యలు తప్పవు

ప్రభుత్వ భూముల ఆక్రమణలపై తహశీల్దారు హెచ్చరిక

నోటీసు బోర్డు ఏర్పాటు చేస్తున్న అధికారులు

ప్రజాశక్తి -కార్వేటినగరం : చట్టానికి విరుద్ధంగా ప్రభుత్వ భూములను ఎవరైనా ఆక్రమించుకుంటే వారిపై శాఖపరమైన చర్యలు తీసుకుంటామని తహశీల్దారు కే నాగరాజు హెచ్చరించారు. ఈ మేరకు ఎర్రమరాజుపల్లె రెవెన్యూ సర్వేనెంబర్ 63 లో 76బి 30 ఎకరాల భూమిని కొంతమంది ఆక్రమించుకున్నారని, గ్రామస్తులు శ్మశానం, ప్రభుత్వ భవనాల నిర్మాణం కోసం తమకు స్థలం లేదని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు తహశీల్దారు కె నాగరాజు రెవెన్యూ సిబ్బందితో కలిసి శనివారం సంఘటన స్థలాలకు వెళ్లి ప్రభుత్వ భూముల్లో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. గ్రామస్తుల కోరిక మేరకు శ్మశానం కోసం స్థలాన్ని గుర్తించి కేటా యిస్తామని గ్రామస్తులకు తెలిపారు. ఇందు లో ఆర్ఐటి నరసింహులు, వీఆర్వో తేజనాథ్, సర్వేయర్ మురళి, వీఆర్ఏలు బాలయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

సెషన్స్ కోర్టుల ఏర్పాటులో ఎన్‌డిఎ సర్కార్ విధానాలు ఏంటి?

పార్లమెంటులో ప్రశ్నించిన ఎంపీ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్ : ఆంధ్రప్రదేశ్‌లో నూతనంగా విభజించిన జిల్లాలో సెషన్స్ కోర్టుల ఏర్పాటుకు సంబం ధించి, ప్రభుత్వం అవలంబిస్తున్న విధి, విధానాలను తెలపాలని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు ఎన్‌డిఏ సర్కారుకు విజ్ఞప్తి చేశారు. గత ఐదేళ్లలో ఏపీలో సెషన్స్ కోర్టుల పునఃవిస్తరణకు, మంజూరు చేసిన నిధులు, వాటి వివరాలను తెలపాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు కేంద్ర చట్టం, న్యాయ శాఖ తక్షణం స్పందించిందని తాము కోరిన సమాచారాన్ని అందించినట్లు చిత్తూరు ఎంపీ తెలిపారు. న్యూఢిల్లీ పార్లమెంటు శీతాకాల సమావేశాలకు హాజరైన చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, తన కర్తవ్యాన్ని చిత్తశుద్ధితో నిర్వర్తిస్తున్నా రన్నారు. ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ప్రోత్సాహంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రగతి, తాను ప్రాతినిధ్యం వహిస్తున్న చిత్తూరు పార్లమెంటు అభివృద్ధి కోసం భారత ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, దీనికి సంబంధించిన నిధులను రాబట్టేందుకు సహచర ఎంపీల బృందంతో కలిసి, తన వంతు కృషి చేస్తున్నామన్నారు.

మతం పేరుతో రాజ్యాంగ మార్పును వ్యతిరేకించాలి

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : మతం పేరుతో రాజ్యాంగాన్ని మార్చడాన్ని వ్యతిరేకించాలని సీపీఐ నాయకులు పిలుపునిచ్చారు. సీపీఐ నాయకులు, ప్రజా సంఘాల నాయకులకు శనివారం ఉదయం సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏ రామానాయుడు సమావేశం ప్రారంభించారు. భారత దేశ అభివృద్ధిపై, ప్రజా సమస్యలపై నిరంతరం కమ్యూనిస్టులు పనిచేసేవారని సభల్లో , మాట్లాడే వారని, ప్రభుత్వాన్ని నిలదీసే వారన్నారు. కానీ ప్రస్తుత రాజకీయాల పరిస్థితి చూస్తే మతం పేరుతో, మతోన్మాదంతో మతాలు, కులాల మధ్య, రాష్ట్రాల మధ్య చిచ్చుపెట్టి అధికారమే పరమవధిగా మతాన్ని తీసుకొస్తూ రాజ్యాంగాన్ని మార్చడాన్ని తీవ్రంగా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు.

నిరుద్యోగ నిర్మూలనే ధ్యేయం

ఎమ్మెల్యే డాక్టర్ విఎం థామస్

ఉద్యోగ ఎంపిక పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే విఎం థామస్

ప్రజాశక్తి - ఎస్ఆర్‌పురం : నిరుద్యోగ నిర్మూలన తన ధ్యేయమంటూ ఎన్నికల ముందు సభలలో ఇచ్చిన హామీని ఎమ్మెల్యే డాక్టరు విఎం థామస్ నెరవేర్చుతున్నారు. తనదైన శైలిలో మండలాన్ని పారిశ్రామిక హబ్‌గా ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తూ మరోవైపు జాబ్ మేళాలు నిర్వహిస్తూ నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నా మని ఎమ్మెల్యే తెలిపారు. మండల కేంద్రంలోని ఎస్ఎల్‌వి కల్యాణ మండపంలో శనివారం జాబ్ మేళా నిర్వహించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఇన్ఫోసిస్, టాటా ఎలక్ట్రానిక్స్, అమర్ రాజా, సిసిఎస్ లాంటి కంపెనీలు 15 కంపెనీలు నిర్వహించిన ఈ జాబ్ మేళాలో జాబ్ మేళాకు 350 మంది నిరుద్యో గులకు ఇంటర్వ్యూలకు హాజరుకాగా అందులో 244 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించారు. జాబ్ మేళాకు హాజరైన ఎమ్మెల్యే ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్యోగం ఒక అవసరం మాత్రమే కాదని, యువత యువతకు ఆత్మవిశ్వాసం కూడా పెంచుతుందన్నారు. తాను నియోజకవర్గంలో గ్రామీణ ప్రాంతాలలో యువత ఉన్నత చదువుకుని నిరుద్యోగులుగా ఉన్నారని ఈ విషయం ఎన్నికల ప్రచారంలో గమనించామన్నారు. ఎమ్మెల్యేగా ఎన్నికైనప్పటి నుంచి గంగాధర నెల్లూరు నియోజకవర్గంలో పరిశ్రమల స్థాపన కోసం కృషి చేస్తున్నామన్నారు. కానీ ఈ మధ్య కాలంలో పరిశ్రమలకు స్థాపన కోసం చేసిన పనులు వివరించారు. ఇంటర్వ్యూలో ఎంపికైన యువతకు తన చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందించారు.

నిరుద్యోగుల హర్షం..

గతంలో ఎన్నడూ లేనివిధంగా నియోజకవర్గంలో 15 కంపెనీల ద్వారా జాబ్ మేళా నిర్వహించి భారీగా 240 నాలుగు మంది యువతకు ఉద్యోగాలు ఇవ్వడంతో యువత హర్షం వ్యక్తం చేశారు. శ్రీరంగరాజపురం మండల కేంద్రం యువకులతో కిటకిటలాడింది. మండల కేంద్రంలో శనివారం పండగ వాతావరణం నెలకొంది. నియామక పత్రాలు అందుకున్న యువకులు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ డాక్టర్ వి ఎం థామస్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

యువత ఉన్నత స్థానాలకు ఎదగాలి...

నిరుద్యోగ యువత ఉద్యోగాలు సంపాదించిన అనంతరం కష్టపడి ఉన్నత స్థానాలు ఎదగాలని సూచించారు. పారిశ్రామిక వాడకు స్థల కోసం సర్వే జరిపారని పెద్దమనసుతో స్థలం అప్పగించి నియోజకవర్గాన్ని పారిశ్రామిక హబ్‌గా ఏర్పాటు చేయడానికి కృషి చేయాలని ఆయన సూచించారు. పారిశ్రామిక హబ్‌గా ఏర్పడితే ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉంటాయని తద్వారా పరిసర గ్రామాలు అభివృద్ధి చెందాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు, నియోజక వర్గంలోని అన్ని మండలాల టిడిపి అధ్యక్షులు, కంపెనీల ప్రతినిధులు, టిడిపి నాయకులు యువకులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

మద్యం తాగి వాహనాలు నడిపిన 13 మందికి జరిమానా

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ నిర్వహించిన వాహన తనిఖీల సందర్భంగా మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 13 మంది వ్యక్తులు పట్టుబడ్డారు. రోడ్డుపై పెట్టి షాప్‌లు నిర్వహించి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే 96 మందిని శనివారం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టులో ప్రవేశ పెట్టారు. మద్యం తాగి వాహనాలు నడిపిన ఒక్కొక్కరికి న్యాయమూర్తి కుమారి ఉమాదేవి రూ.పదివేలు చొప్పున మొత్తం రూ.1లక్ష30వేల రూపాయలు జరిమానా విధించారు. రోడ్డుపై షాప్‌లు నిర్వహించి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించిన 96 మందికి ఒక్కొక్కరికి రూ. 50 చొప్పున రూ . 4800 రూపాయలు జరిమానా విధించారు. రోడ్డు భద్రతా నియమాలను పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, వాటిని తప్పనిసరిగా పాటించకపోతే భారీ జరిమానాలు తప్పవని, మద్యం తాగి వాహనం నడపడం అత్యంత ప్రమాదకరమని, ఇది వాహనదారుల ప్రాణాలకు మాత్రమే కాకుండా ఇతరుల ప్రాణాలకు కూడా ముప్పు కలిగిస్తుందని హెచ్చరించారు. ట్రాఫిక్ కు అంత రాయం కలిగించే విధంగా షాప్‌లు రోడ్డుపై నిర్వహించ కూడదని ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ హెచ్చరించారు.

బోరు విద్యుత్ వైరు చోరీ

ప్రజాశక్తి-కుప్పం: కుప్పం మండలం మల్లనూరు పంచాయతీ పరిధిలో బోరు మరమ్మతు కోసం పైపులు, విద్యుత్ వైరు బయటకు తీయగా శుక్రవారం రాత్రి వైరు చోరీకి గురి అయిందని పంచాయతీ కార్యదర్శి రమ్యలక్ష్మి శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మల్లనూరు - వేపూరు మార్గంలోని ఆర్డబ్ల్యూఎస్ బోరు రిపేరు కాగా మరమ్మతు చేసేందుకు పైపులు కేబుల్ బయటకు తీశారు. శుక్రవారం రాత్రి దొంగలు తీసుకెళ్లారని ఆమె ఫిర్యాదులో పేర్కొంది.

మండల సమావేశం వాయిదా

ప్రజాశక్తి -పెద్దపంజాణి: శనివారం నిర్వహించాల్సిన మండల సర్వసభ్య సమావేశం నేడు ఆదివారం 18వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు ఇన్‌ఛారి ఎంపీడీవో శారదా దేవి శనివారం పేర్కొన్నారు. సమావేశం నిర్వహణకు తగినంత మంది సభ్యులు లేకపోవడంతో వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. ఎంపీటీసీలు గత సంవత్సరం మండలంలోని వివిధ శాఖలకు వచ్చిన నిధుల వివరాలు కోరితే తెలపకపోవడంతో గైర్హాజరవుతున్నామని వైస్ ఎంపీపీ ఎంపీటీసీలు తెలిపారు. ఈ విషయమై ఇన్‌ఛార్జి ఎంపీడీవో శారదా దేవికి వినతి పత్రం అందించారు.

సోలార్ కంచె నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న చల్లా రామచంద్రారెడ్డి

సోలార్ కంచె నిర్మాణానికి భూమి పూజ

ప్రజాశక్తి - రొంపిచర్ల: ఏనుగుల దాడులను నిరోధించేందుకు చేపట్టిన సోలార్ కంచె నిర్మాణానికి రొంపిచెర్ల నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి శనివారం భూమి పూజ నిర్వహించారు. పులిచెర్ల మండలంలో ఇటీవలి కాలంలో రైతులకు ఏనుగుల బెడద ఎక్కువై రైతులు తీవ్ర నష్టానికి గురవుతుండడం తెలిసిందే. రైతులు ఈ విషయాన్ని, వారి సమస్యలను పుంగనూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛారి చల్లా రామచంద్రారెడ్డికి తెలిపారు. ఈ విషయాన్ని చల్లా రామచంద్రారెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించే ప్రయత్నం చేశారు. పాలెం పంచాయితీ నుండి దేవలంపేట పంచాయతీ మీదగా దేశి రెడ్డి గారి పల్లి వరకు దాదాపు 5 కిలోమీటర్లు అడవి చుట్టూ సోలార్ కంచె వేయడానికి 48 లక్షల రూపాయలు కేటాయించారు. సోలార్ కంచె నిర్మాణానికి పనులు ప్రారంభించ డానికి భూమి పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పుంగనూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి చల్లా బాబు రెడ్డి పాల్గొని వారి చేతుల మీదుగా భూమి పూజను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కంచెను మరింత పెంచేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి , ఉప ముఖ్యమంత్రి, అటవీశాఖ మంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకువెళ్లి మరిన్ని నిధులు తీసుకొచ్చేలా కృషి చేస్తానని రైతులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి మురళి, సింగిల్ విండో ఛైర్మన్ లెక్కల ధనంజయ నాయుడు, కుమార్ రెడ్డి, రవి నాయుడు , ముల్లంగి వెంకటరమణ, మహేష్ పాల్గొన్నారు.



స్మార్ట్ ఇండియా హ్యాకథాన్‌లో కేఈసీకి ప్రథమ బహుమతి

ప్రజాశక్తి-కుప్పం: కుప్పం ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన ఫైనల్ ఇయర్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ ఈసీఈ విద్యార్థులు స్మార్ట్ ఇండియా హ్యాకథాన్- 2025 - గ్రాండ్ ఫినాలేలో ప్రథమ బహుమతి సాధించి రూ.1.50 లక్షల నగదు పురస్కారం గెలుచుకున్నారు. డిసెంబర్ 8 నుండి 12 వరకు తమిళనాడులోని సత్యమంగళం, ఈరోడ్ జిల్లాలో ఉన్న బన్నారి అమ్మన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో గ్రాండ్ ఫినాలే నిర్వహించారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన కళాశాల విద్యార్థులను చైర్మన్ బీసీ నాగరాజ్ అభినందిస్తూ సత్కరించారు.ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ సునీల్ రాజ్,కార్యదర్శి సాగర్ రాజ్, ప్రిన్సిపల్ డాక్టరు సుధాకర్ బాబు, డాక్టర్ కోదండరామయ్య అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.1



కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

ఉచిత వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-కుప్పం: కుప్పం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పిఈఎస్ ఆస్పత్రి వారిచే శనివారం నిర్వహించిన ఉచిత కంట, డయాబెటిక్ వైద్య శిబిరంలో 60 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు లయన్స్ క్లబ్ ప్రతినిధులు మహేష్, సతీష్ తెలిపారు. మెరుగైన వైద్యం కోసం పది మందిని పిఇఎస్ ఆసుపత్రికి రెప్ప చేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ వైస్ ప్రెసిడెంట్ సెల్వం, సభ్యులు జయరాం నాయుడు, డాక్టరులు స్థానికులు పాల్గొన్నారు.